

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం 17-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :91 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్



## ఏపీ పోలీస్‌లో కొలువుల జాతర!




2 లో

ఏపీ పోలీస్ శాఖలో 2,050 ఉద్యోగాల భర్తీ

438 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్

1,156 కానిస్టేబుల్ పోస్టులతో భారీ రిక్రూట్‌మెంట్

ఫైర్‌మెన్, వార్డర్ పోస్టులకు కూడా అవకాశం

కమ్యూనికేషన్స్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో ఖాళీలు

ఫోరెన్సిక్ విభాగంలో సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులు

దరఖాస్తు తేదీలు, పరీక్షల షెడ్యూల్ త్వరలో వెల్లడి

## మంటలు మండాయి కేసు చల్లారింది!

40 గంటల తర్వాత కేసు నమోదు

ఆలస్యంపై పోలీసుల తీరుపై ప్రశ్నలు

'షార్ట్ సర్క్యూట్'గా ప్రమాదం నమోదు

ఎఫ్‌ఐఆర్‌లో నిందితులు లేరు

విషపూరిత పొగలపై అనుమానాలు

గోదాముల అనుమతులపై ప్రశ్నలు

సమగ్ర దర్యాప్తుకు స్థానికుల డిమాండ్



**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఫాక్స్ సాగర్ (దూలపల్లి) పరిసరాల్లో ఆరు రోజుల క్రితం ఆకాశాన్ని తాకేలా ఎగిసిపడిన మంటలు, దట్టమైన విషపూరిత పొగలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. అయితే ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసుల దర్యాప్తు తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీ అగ్ని ప్రమాదం జరిగినప్పటికీ.. ఎఫ్‌ఐఆర్‌లో మాత్రం సాధారణ 'షార్ట్ సర్క్యూట్' ప్రమాదంగా నమోదు చేయడం, ఎలాంటి నిందితుడిని పేర్కొనకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

40 గంటల తర్వాత ఎఫ్‌ఐఆర్.. కారణం ఇదేనా?

సెప్టెంబర్ 10న రాత్రి 8:45 గంటలకు అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్సై స్థాయి అధికారులు సైతం ప్రమాద ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అయితే ఎఫ్‌ఐఆర్ మాత్రం సుమారు 40 గంటల తర్వాత.. సెప్టెంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు నమోదైంది.

2 లో

## భారత్‌తో పాక్ కయ్యం!

భారత జలాల్లోకి పాక్ నౌక ప్రవేశం

భారత యుద్ధనౌకను ఢీకొట్టిన పాక్ నౌక

ఒప్పంద నిబంధనల ఉల్లంఘనపై భారత్ ఆగ్రహం

పాక్ రాయబారికి విదేశాంగ శాఖ సమన్లు

ఆర్టికల్ 10 ఉల్లంఘించిందన్న భారత్

ఘటనపై వివరణ కోరిన భారత ప్రభుత్వం

మళ్లీ ఇలాంటి ఘటనలు జరగొద్దని హెచ్చరిక

2 లో

## పీఎఫ్ పరిమితి పెంపు!

పీఎఫ్ పరిమితి రూ.25 వేలకు పెంపు

51 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి

2014 తర్వాత తొలిసారి పెంపు

కేంద్రంపై రూ.11,339 కోట్ల భారం

రిటైర్మెంట్ సేవింగ్స్‌కు బలం

పెన్షన్ ప్రయోజనాలు మరింత మెరుగు

ఉద్యోగుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ భరోసా

సామాజిక భద్రతకు మరింత రక్షణ




2 లో

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ఊరటనిచ్చే అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ వేతన పరిమితిని గణనీయంగా పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి అశ్వనీ వైష్ణవ్, జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు. 2014 తర్వాత ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వేతన పరిమితిని పెంచడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## అగ్గిపుల్ల కోసం హత్య!

అగ్గిపుల్ల ఇవ్వలేదని మొదలైన గొడవ

వాగ్వాదం తీవ్రం కావడంతో కత్తితో దాడి

30 ఏళ్ల భవానీ అక్కడికక్కడే మృతి

మరో వ్యక్తికి ఛాతిలో కత్తిపోటు

ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మైనర్‌తో పాటు ఇద్దరి అరెస్ట్

హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం

2 లో

## నమ్మ క్లినిక్‌లో బిగ్ స్కామ్!

నమ్మ క్లినిక్‌లో అవకతవకలపై ఆరోపణలు

విధులకు రాకుండానే రెండేళ్లుగా జీతం

ఆర్టీఐ రికార్డులతో వెలుగులోకి వ్యవహారం

ఎమ్మెల్యే మేనకోడలిపై తీవ్ర ఆరోపణలు

ప్రజాధనం దుర్వినియోగంపై ప్రతిపక్షాల ఫైర్

సమగ్ర విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

2 లో

## భారత్‌కు అమెరికా బిగ్ షాక్!



2 లో

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** రష్యా నుంచి ముడి చమురు, సహజవాయువును భారీగా దిగుమతి చేసుకుంటున్న భారత్ సహా ఐదు ప్రధాన దేశాల నుంచి వచ్చే వస్తువులపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలను (టారిఫ్‌లు) విధించేందుకు వీలు కల్పించే..

## తిరుపతికి భారీ వరాలు!



2 లో

రుపతికి స్కైవాక్.. బస్టాండ్ అభివృద్ధి

ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళిక

తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుస్తాం

100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం

రూ.3,165 కోట్ల కార్పస్‌తో అన్నదానానికి చర్యలు

టీటీడీ సేవల విస్తరణ.. 5 వేల ఆలయాల అభివృద్ధి

తిరుమలలో వైద్య సేవలకు మరిన్ని చర్యలు



# ఎమ్మెల్సీ రేస్.. ఫుల్ హీట్!

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** అధికార పార్టీలో 5 ఎమ్మెల్సీ పదవుల కోసం సుమారు 50 మందిపైగా లీడర్లు పోటీ పడుతున్నారు. పదవులను దక్కించుకునేందుకు ఆశావహులు లాబీయింగ్ మొదలుపెట్టారు. కొందరు అధిష్టానం పెద్దల నుంచి పైరవీలు చేస్తుండగా, ఇంకొందరు నేరుగా సీఎం రేవంత్ ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన దృష్టిలో పడేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. నవంబరులో గవర్నర్ కోటాలోని 3 ఎమ్మెల్సీల పదవీ కాలం ముగుస్తుండగా గ్రాడ్యుయేట్ కోటాలో 2 ఎమ్మెల్సీల ఎన్నికలు మార్చిలో జరగనున్నాయి. దీంతో ఒకేసారి 5 ఎమ్మెల్సీల అభ్యర్థులను ప్రకటించాలా? ముందుగా గ్రాడ్యుయేట్ అభ్యర్థులను ప్రకటించి, ఆ తర్వాత గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ప్రకటించాలా? అని కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన చేస్తున్నది.

మిగతాది 2 లో..

- ఐదు పదవులు.. భారీ పోటీ
- 50 మందికి పైగా ఆశావహులు
- సామాజిక సమీకరణాలపై ఫోకస్
- గెలుపు గుర్రాలకే ఛాన్స్
- గ్రాడ్యుయేట్ సీట్లపై గురి
- ఇద్దరు సలహాదారుల పోటీ
- జర్నలిస్టులూ రేసులోనే
- కొండా మురళి లాబీయింగ్

## 22ఏ భూములపై సీఎం గుడ్ న్యూస్!

12 అంశాలపై ప్రభుత్వ గుర్తింపు

పెండింగ్ రిజిస్ట్రేషన్లకు వారంలో పరిష్కారం


హెచ్‌ఎండీఏ, డీటీసీపీ లేఔట్లకు గ్రీన్‌సిగ్నల్

22ఏలో చేర్పులు, తొలగింపులకు నిబంధనలు

క్రమబద్ధీకరించిన భూములకు విముక్తి

వేలం భూములపై సీఎం కీలక ప్రకటన

కోటి ఎకరాలపై కేసీఆర్‌కు సవాల్



**న్యూస్ డెస్క్,16 సెప్టెంబరు (ఇది కద నిజం):** 22ఏ సమస్యల్లో 12 అంశాలను ప్రభుత్వం గుర్తించిందని యూఎల్ సీ భూముల విషయంలో త్వరలోనే నూతన విధానం తీసుకువస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధీకృత లే ఔట్ల లోని భూముల పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు పొందిన లేఔట్ రిజిస్ట్రేషన్లు చేస్తామని ప్రకటించారు. 22ఏ పై అసెంబ్లీలో మాట్లాడిన సీఎం.. ఇకపై 22ఏ లో తొలగించాలన్నా, చేర్చాలన్నా నిబంధనలు రూపొందిస్తున్నామని చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ లో చేర్చితే కలెక్టర్లు, ఆర్డీవో తొలగిస్తారని ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామన్నారు.

2 లో

## యూపీఐపై కొత్త భారం!

యూపీఐపై కొత్త ఎండీఆర్ ఛార్జీలు

అక్టోబర్ 15 నుంచి అమలు


రూ.2 వేలపై లావాదేవీలకు రుసుము

వ్యాపారులపైనే ఛార్జీల భారం

గరిష్ట ఎండీఆర్ రూ.300 మాత్రమే

కీలక రంగాలకు రూ.5 ఫ్లాట్ రేట్

సామాన్యుల యూపీఐ చెల్లింపులు ఉచితం




**న్యూస్ డెస్క్,16 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ నిర్వహణను మరింత పటిష్ఠం చేసేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ప్రకటన చేసింది. అక్టోబర్ 15 నుండి ఎంపిక చేసిన 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానాన్ని అమలు చేయనున్నట్టు వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం.. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన వ్యక్తులు చెల్లించే లావాదేవీలపై వ్యాపారులు 0.4 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే సాధారణ వినియోగదారులకు, అలాగే ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి చేసే (పీ2పీ) చెల్లింపులకు ఎలాంటి ఛార్జీలు ఉండవు.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 17-09-2026

# 22ఏ భూములపై సీఎం గుడ్ న్యూస్!

**మొదటి పేజీ తరువాయి**

ఎవరైనా వేలంలో కొనుక్కున్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామన్నారు.

ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ కన్ను వాటిపై..

బీఆర్ఎస్ పాలకులు నీటి ప్రాజెక్టుల్లో రూ. కోట్ల అవినీతి చేశారని నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని భూదోపిడీ గురించి చేసిన ఆలోచన నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ధరణి అనే పురుగే భూతమై తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తోందన్నారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేసామని చెప్పారు. కానీ కేసీఆర్ చెప్పింది పచ్చి అబద్ధం అని ఉరిశిక్ష వేసేంతటి పచ్చి అబద్ధం అన్నారు. ధరణి వాస్తవానికి 2010లో ఒడిశాలో మొదలైందని 2014లో కాగ్ ధరణిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్ఎఫ్ఎస్ దక్కించుకుంది. ఐఎల్ఎఫ్ఎస్.. ధరణిని టెరాసిస్ అనే కంపెనీకు అమ్ముకుంది. టెరాసిస్ అనే కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందన్నారు.

నేరుగా సవాల్ విసురుతున్నా..

రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టిందని అంటున్నారు. దాదాపు ఈ కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. తాను అధికారికంగా సవాల్ విసురుతున్నాను.. ఇందులో నుంచి ఇంచు భూమైనా తీయగలిగే శక్తి ఈ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించండి అని కేసీఆర్ తే లేఖ రాయించాలన్నారు. ఈ కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో లేకుంటే పేదలకు అన్యాయం చేసినట్లేనన్నారు. అసలు వివాదం అంతా 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనని 3.73 లక్షల ఎకరాలను చూపి కోటి ఎకరాలు అంటూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నిషేధిత జాబితాలో ఏ భూములు పెట్టాలో గతంలో హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్ లో పెట్టామన్నారు.

# యూపీఐపై కొత్త భారం!

**మొదటి పేజీ తరువాయి**

**ఎంత మొత్తానికి ఎంత వసూలు**

ఈ నూతన ఛార్జీల లెక్కింపును పరిశీలిస్తే... రూ. 3,000 లావాదేవీపై రూ. 12, అలాగే రూ. 50,000 లావాదేవీపై రూ. 200 ఎండీఆర్ పడుతుంది. అయితే ఎంత పెద్ద మొత్తంలో చెల్లింపు చేసినప్పటికీ, ఛార్జీల గరిష్ట పరిమితిని రూ. 300కే పరిమితం చేశారు. ఉదాహరణకు, రూ. లక్ష లావాదేవీపై సాధారణంగా రూ. 400 పడాల్సి ఉన్నా, గరిష్ట పరిమితి వల్ల కేవలం రూ. 300 మాత్రమే వసూలు చేస్తారు.

**కీలక రంగాలకు రాయితీ**

అయితే, కొన్ని కీలక రంగాలకు సంబంధించిన లావాదేవీలపై నిర్దిష్ట ఛార్జీలకు బదులుగా ఫ్లాట్ ఎండీఆర్ వర్తిస్తుంది. రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, వ్యవసాయ ఉత్పత్తులు, పెట్రోల్ బంకుల వంటి కీలక రంగాలకు రాయితీ కల్పిస్తూ రూ. 2,000 దాటిన చెల్లింపులపై కేవలం రూ. 5 ఫ్లాట్ ఛార్జ్ అమలవుతుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇక డీలర్లకు, స్టాక్ బ్రోకర్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి క్యాపిటల్ మార్కెట్ చెల్లింపులపై 0.02 శాతం (గరిష్టంగా రూ. 300) ఎండీఆర్ నిర్ణయించారు. ప్రభుత్వ పన్నులు, చలానాలు, యుటిలిటీ బిల్లులు, కొన్ని ప్రభుత్వ సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఎటువంటి ఎండీఆర్ ఉండదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. ఇవి కూడా రూ. 2,000 దాటితే రూ. 5 ఫ్లాట్ రేట్ మాత్రమే వర్తిస్తుంది.

**వినియోగదారులపై నో ఛార్జీ**

ఈ రుసుమును కేవలం వ్యాపారులే భరించాలని, దానిని ప్లాట్‌ఫామ్ ఫీజు రూపంలో గానీ లేదా మరే రకంగా గానీ వినియోగదారులపై మోపకూడదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. అంతేకాకుండా, రోజువారీగా చేసే చిన్న యూపీఐ పేమెంట్లు అయిన టీ షాప్, కిరాణా, రెస్టారెంట్, చిన్న షాపుల మొదలైనవి ఈ కొత్త ఎండీఆర్ పరిధిలోకి రావు. నెలకు రూ. లక్ష వరకు వ్యాపారం చేసే చిన్న వీధి వ్యాపారులను ఈ ఛార్జీల నుంచి పూర్తిగా మినహాయించారు.

**95 శాతం లావాదేవీలు రూ. 2,000 లోపే**

ఈ ఏడాది ఒక్క ఆగస్టు నెలలోనే యూపీఐ ద్వారా రూ. 29.9 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటిలో 95 శాతానికి పైగా లావాదేవీలు రూ. 2,000 లోపే ఉండటే. దీనివల్ల సామాన్య ప్రజలతో పాటు చిన్న వ్యాపారులపైనా ఎలాంటి ప్రభావం ఉండదని, మిగతా 5 శాతం పెద్ద లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయం డిజిటల్ రంగానికి మరింత ఊతమిస్తుందని ఆర్థిక శాఖ వెల్లడించింది.

**ఎందుకు ఈ ఛార్జీ తీసుకొస్తున్నారు?**

ఈ నిధులు నెట్‌వర్క్ భద్రత, మోసాల నివారణ, సర్వర్ల సామర్థ్యం పెంచడానికి ఏటా దాదాపు రూ. 20,000 కోట్ల నిర్వహణ వ్యయం అవుతోంది. ఇప్పటివరకు ప్రభుత్వ సబ్సిడీపై నడిచిన ఈ వ్యవస్థను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకే ఈ రుసుములు తెచ్చినట్లు అధికారులు వెల్లడించారు. బెర్న్‌స్టెయిన్ అంచనాల ప్రకారం ఈ కొత్త విధానం ద్వారా 2028 ఆర్థిక సంవత్సరం (2027-28) నాటికి ఏటా రూ. 22,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. ఇందులో బ్యాంకులు రూ. 14,000 కోట్లు, పేమెంట్ యాప్‌లు రూ. 7,000 కోట్లు, పేమెంట్ నెట్‌వర్క్ కంపెనీలు సుమారు రూ.1,000 కోట్లు సంపాదించే అవకాశముంది.

ఈ నిధుల ద్వారా వచ్చే ఆదాయంతో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌తో పాటు టైర్-3 నుంచి టైర్-6 నగరాల్లో డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్‌బీఐ సంప్రదింపులతో మూడు నెలల్లో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నారు. అంటే, సామాన్య వినియోగదారుడికి యూపీఐ ఉచితంగానే కొనసాగిస్తూ, పెద్ద వ్యాపార లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయంతో దేశ డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే ఈ కొత్త విధానం ప్రధాన లక్ష్యంగా నిపుణులు పేర్కొన్నారు.

# నమ్మ క్లినిక్‌లో బిగ్ స్కామ్!



**న్యూస్ డెస్క్,16 సెప్టెంబరు (ఇది కద నిజం):** కర్ణాటక ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'నమ్మ క్లినిక్' పథకంలో భారీ అవకతవకలు బయటపడటం తీవ్ర దుమారం రేపుతోంది. బాగల్‌కోట్ జిల్లా గుళేదగుడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.వై. మేటి మేనకోడలు డాక్టర్ అంకిత యార్గల్ ఒక్క రోజు కూడా విధులకు హాజరు కాకుండా గత రెండేళ్లుగా నిరంతరాయంగా ప్రభుత్వ జీతం తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగుచూసిన ఈ ఆరోపణల ప్రకారం.. ఆమె నమ్మ క్లినిక్‌లో వైద్యాధికారిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేరినప్పటి నుంచి క్లినిక్ వైపే వెళ్లలేదని, రిజిస్టర్లలో సంతకాలు సైతం పెట్టకుండానే ప్రతినెలా ఆమె ఖాతాకు పూర్తి వేతనం జమవుతోందని తేలింది. సామాన్య ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన కేంద్రాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువులు అండదండలతో ఈ నిధుల దోపిడీ సాగుతోందని స్థానికులు, ఆర్టీఐ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

ఈ ఉదంతం రాజకీయ వర్గాల్లో పెను దుమారానికి దారితీయడంతో ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ సర్కారుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కాంగ్రెస్ నేతల స్వజనపక్షపాతం, అవినీతికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన ఎమ్మెల్యే, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని అక్రమంగా కాజేసిన వారి నుంచి సొమ్మును రికవరీ చేయాలని స్పష్టం చేశారు. ఈ వివాదం తీవ్రం కావడంతో జిల్లా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. పూర్తి హాజరు పట్టికలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు.

# భారత్‌తో పాక్ కయ్యం!



**న్యూస్ డెస్క్,16 సెప్టెంబరు (ఇది కద నిజం):** శత్రుదేశం పాకిస్థాన్ భారత్‌తో మరోసారి కయ్యానికి కాలు దువ్వుతోంది. 1991 సైనిక ఒప్పంద నియమాలను ఉల్లంఘించి అరేబియా సముద్రంలో భారత జలాల్లోకి పాక్ నౌక ప్రవేశించింది. అక్కడితో ఆగకుండా భారత యుద్ధనౌకను ఢీ కొట్టింది. దీంతో పాకిస్థాన్ తీరుపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సైనిక ఒప్పంద నియమాలను ఉల్లంఘించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ రాయబారి సాద్ అహ్మద్ వరిచ్‌కు భారత విదేశాంగశాక సమన్లు జారీ చేసింది. ఆయనను ఢిల్లీలోని కార్యాలయానికి పిలిచి ఘటనకు సంబంధించి వివరణ కోరింది. భారత నౌకను ఢీకొట్టిన ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదని భారత విదేశాంగశాక పేర్కొంది.

కానీ సైనిక విన్యాసాలు, కసరత్తులు, దళాల కదలికల గురించి ముందుగా సమాచారం ఇవ్వడానికి సంబంధించిన భారత్ పాక్ ఒప్పందంలోని ఆర్టికల్ 10ను పాకిస్థాన్ నేవీ ఉల్లంఘించిందని పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించింది. అన్ని సైనిక విభాగాలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరుపక్షాల మధ్య ఉన్న ఒప్పందాలలోని నిబంధనలను గౌరవించాలని సంబంధిత పాక్ అధికారులకు తెలియజేయాలని పాకిస్థాన్ ఛార్జ్ డి అఫైర్స్‌కు సైతం సూచించింది.

# మంటలు మండాయి.. కేసు చల్లారింది!

**మొదటి పేజీ తరువాయి**

ఈ జాప్యానికి ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న కారణం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'కాలిపోయిన వస్తువుల కోసం ఫిర్యాదుదారుడు వెతుక్కోవడంతో ఫిర్యాదు ఆలస్యమైంది' అని ఎఫ్ఐఆర్‌లోని 8వ కాలమ్‌లో పేర్కొన్నట్లు సమాచారం. భారీ అగ్ని ప్రమాదం జరిగిన సందర్భంలో ఫిర్యాదు కోసం వేచి చూడకుండా పోలీసులు స్వయంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ 40 గంటల వ్యవధిలో కీలక ఆధారాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

సెక్షన్లు 'జీరో'.. నిందితుడు 'శూన్యం'

అనుమతులు లేకుండా గోదాములు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో.. అక్కడ మెడికల్ స్క్రాప్ పేరుతో రసాయనాలతో కూడిన డ్రమ్ములు నిల్వ ఉంచినట్లు ప్రచారం జరిగింది. ప్రమాద సమయంలో విషపూరిత పొగలు వ్యాపించినప్పటికీ.. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నిర్లక్ష్యానికి సంబంధించిన సెక్షన్లు లేకపోవడం చర్చకు దారితీసింది. ఎఫ్ఐఆర్‌లో 'జీరో ఫైర్ యాక్సిడెంట్'గా నమోదు చేయడంతో పాటు.. నిందితుల కాలమ్‌లో 'నో అక్యూజ్డ్' అని పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్రమంగా గోదాములు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కళ్లెదుటే ఆధారాలు.. రికార్డుల్లో మాత్రం 'షార్ట్ సర్క్యూట్'

అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఈ ఘటనపై పలు కథనాలు వెలువడ్డాయి. గోదాముల్లో అనుమతులు లేకుండా మెడికల్ వేస్ట్ స్క్రాప్ నిల్వ చేసినట్లు, రసాయనాలతో కూడిన డ్రమ్ములు ఉన్నట్లు, వ్యర్థాలను తగులబెడుతున్న సమయంలో మంటలు చెలరేగినట్లు పలు కథనాల్లో పేర్కొన్నారు. అదే సమయంలో ప్రమాద ప్రాంతం ఫాక్స్ సాగర్ చెరువు బఫర్ జోన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదానికి అసలు కారణం ఏమిటి? గోదాముల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా? అక్కడ ఏ రకమైన వ్యర్థాలను నిల్వ చేశారు? నిబంధనలు ఉల్లంఘించారా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు స్వయంగా పరిశీలించినప్పటికీ.. ఎఫ్ఐఆర్‌లో మాత్రం సాధారణ 'షార్ట్ సర్క్యూట్'గా నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి.. నిబంధనలకు విరుద్ధంగా గోదాములు నిర్వహించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీ పోలీస్‌లో కొలువుల జాతర!




**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యూనిఫాం కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక, జైళ్లు, ఫోరెన్సిక్ తదితర విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 2,050 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శ్రీకారం చుట్టింది. 2026 జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత నోటిఫికేషన్లను బోర్డు జారీ చేసింది. ఇందులో 438 సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులు ఉండగా.. సివిల్ విభాగంలో 253, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో 116, కమ్యూనికేషన్స్‌లో 50, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో 10, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లో 9 ఖాళీలు ఉన్నాయి. అలాగే అత్యధికంగా 1,156 కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడగా, అందులో సివిల్ కానిస్టేబుల్స్ 542, ఏఆర్ కానిస్టేబుల్స్ 285 పోస్టులు ఉన్నాయి.

అనుబంధ విభాగాల వారీగా పరిశీలిస్తే.. విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలో 158 ఫైర్‌మెన్ పోస్టులు, జైళ్ల శాఖలో 150 పురుష వార్డర్, 21 మహిళా వార్డర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పోలీస్ కమ్యూనికేషన్స్‌లో 200 కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో 198 డ్రైవర్, 15 మెకానిక్ ఉద్యోగాలు ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ పరిధిలో బయాలజీ/సెరాలజీలో 20, కెమికల్‌లో 13, ఫిజికల్ విభాగంలో 10 కలిపి మొత్తం 43 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఇతర సాంకేతిక ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీలు, ప్రిలిమినరీ రాత పరీక్షల షెడ్యూల్‌ను త్వరలోనే బోర్డు అధికారికంగా ప్రకటించనుంది. అభ్యర్థులు పూర్తి వివరాలు, అర్హతలు, సిలబస్ కోసం రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక పోర్టల్‌ను పరిశీలించాలని అధికారులు సూచించారు.

# భారత్‌కు అమెరికా బిగ్ షాక్!

**మొదటి పేజీ తరువాయి**



కీలక ఆంక్షల బిల్లును అమెరికా ప్రతినిధుల సభ తుది ఓటింగ్‌కు సిద్ధం చేసింది. రష్యా-ఇరాన్‌లపై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేసే లక్ష్యంతో రూపొందించిన 'లిండ్సే గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026' ఇప్పటికే సెనేట్ ఆమోదం పొందగా, తాజాగా ప్రతినిధుల సభలో రూల్స్ కమిటీ పరిశీలన అనంతరం రేపటి తుది ఆమోద ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఉక్రెయిన్‌తో యుద్ధం వేళ రష్యా ఇంధన రంగం నుంచి వస్తున్న నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడమే ధ్యేయంగా తీసుకొచ్చిన ఈ ద్వైపాక్షిక బిల్లు ప్రతినిధుల సభలోనూ సులభంగా నెగ్గే అవకాశముందని అక్కడి రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టం అమల్లోకి వస్తే రష్యా నుంచి గరిష్ట పరిమాణంలో చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాల ఉత్పత్తులపై సెకండరీ టారిఫ్‌లు విధించే ప్రత్యేక కార్యనిర్వాహక అధికారం అమెరికా అధ్యక్షుడికి దక్కుతుంది. ఈ ముసాయిదా ప్రతిపాదనలతో భారత ఫార్మా, టెక్స్‌టైల్స్, ఇంజనీరింగ్ తదితర ఎగుమతి రంగాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని వాణిజ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దేశ ఇంధన భద్రత, ఆర్థిక ప్రయోజనాల కోసమే తాము మార్కెట్ నిబంధనల ప్రకారం చమురును దిగుమతి చేసుకుంటున్నామని, ఇప్పటికే వర్తించే అంతర్జాతీయ నిబంధనలను పాటిస్తున్నామని భారత్ గతంలోనే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు, వ్యూహాత్మక బంధంపై ఈ బిల్లు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనేది అంతర్జాతీయంగా తీవ్ర ఆసక్తి రేపుతోంది.

# పీఎఫ్ పరిమితి పెంపు!

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ఊరటనిచ్చే అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ వేతన పరిమితిని గణనీయంగా పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి అశ్వనీ వైష్ణవ్, జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు. 2014 తర్వాత ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వేతన పరిమితిని పెంచడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**51 లక్షల మందికి లబ్ధి..**

ఇప్పటి వరకు రూ.15 వేలుగా ఉన్న పీఎఫ్ సీలింగ్ పరిమితిని ఏకంగా రూ.25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 51 లక్షల మంది ఉద్యోగులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. అర్హులైన ఉద్యోగులందరికీ లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం ఏడాదికి రూ.11,339 కోట్ల నిధులను కేటాయించనుంది. అయితే, ఈ వేతన పరిమితి పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వంపై ఏటా రూ.11,339 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

**ఉద్యోగులకు సామాజిక భద్రత ప్రయోజనాలు**

పీఎఫ్ వేతన పరిమితి పెంపుతో ఉద్యోగులు మరింత మెరుగైన సామాజిక భద్రతను పొందనున్నారు. ముఖ్యంగా ఈపీఎఫ్ ద్వారా ఉద్యోగి రిటైర్మెంట్ సేవింగ్స్ మరింత బలంగా తయారవుతాయి. అలాగే పెన్షన్ ద్వారా భవిష్యత్తులో అందే పెన్షన్ లబ్ధి మెరుగవుతుంది. వీటితో పాటు ఉద్యోగ భద్రతతో పాటు కుటుంబానికి భరోసానిచ్చే ఇన్సూరెన్స్ ప్రయోజనాలు కూడా ఉద్యోగులకు వర్తించనున్నాయి. ఉద్యోగుల దీర్ఘకాలిక సంక్షేమం, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# అగ్గిపుల్ల కోసం హత్య!

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** సిగరెట్ వెలిగించుకునేందుకు అగ్గిపుల్ల ఇవ్వాలేదనే విషయంపై జరిగిన చిన్న వివాదం ఒక యువకుడి హత్యకు దారి తీసింది. ఈ ఘటన ఢిల్లీలోని కేశవ్‌పురంలో జరిగింది. మరణించిన వ్యక్తిని 30 ఏళ్ల భవానీగా గుర్తించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి గాయపడ్డారు. ఈ నేరంలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కేశవ్‌పురం ప్రాంతంలో ఓ వైన్ షాపు ముందు భవానీ, ఆశారామ్ అనే ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఇదే సమయంలో ముగ్గురు వ్యక్తులు వారిని సిగరెట్ వెలిగించుకునేందుకు అగ్గిపుల్ల ఇవ్వాలని కోరారు.

తమ వద్ద అగ్గిపెట్టే లేదని చెప్పడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ తీవ్రం కావడంతో నిందితులు ఇద్దరిపై దాడికి పాల్పడి, కత్తితో పొడిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో భవానీ తీవ్రంగా గాయపడగా, అతడిని వెంటనే దీప్ చంద్ర బంధు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. భవానీ పొట్టలో ఎడమవైపు తీవ్రమైన గాయమైనట్లు పోలీసులు తెలిపారు. మరో బాధితుడు ఆశారామ్ ఛాతిలో కత్తిపోటుకు గురయ్యాడు.

ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న నరేశ్ బహదూర్ అలియాస్ నేపాలీ (19)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు తరుణ్ (19), మరో మైనర్ నేరస్తుడిని కూడా పట్టుకున్నట్లు వెల్లడించారు. నరేష్ కత్తితో దాడిచేసినట్లు తేలింది. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతికి భారీ వరాలు!

**న్యూస్ డెస్క్, 16 సెప్టెంబరు (ఇది కద నిజం):** తిరుపతి పట్టణంపై సీఎం చంద్రబాబు నాయుడు వరాలు కురిపించారు. తిరుపతి పట్టణంలో పర్యటించిన ఆయన స్కైవాక్ నిర్మాణంతో పాటు బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం చేపడతామన్నారు. తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుస్తామని, 100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్ చేయాలని, రూ.3165 కోట్ల కార్పస్‌తో అన్నదానం చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. అలాగే 6 కార్యక్రమాలతో టీటీడీ సేవలను విస్తరిస్తామని, 5 వేల దేవాలయాలు చేపడతామని తెలిపారు. హిందువులు అధికంగా ఉన్న నగరాలను గుర్తించి, శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. తిరుమలలో వైద్య సేవలకు చర్యలు చేపడుతున్నామన్నారు. 1999లో తిరుమలలో మ్యూజియాన్ని తానే ప్రారంభించామనని, మళ్లీ ఇప్పుడు ఆధునీకరించింది తానేనని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఎమ్మెల్సీ రేస్.. ఫుల్ హీట్!

**మొదటి పేజీ తరువాయి**

సామాజిక సమీకరణలో అభ్యర్థుల ఎంపిక?

మొత్తం 5 ఎమ్మెల్సీలు (గవర్నర్ కోటా-3, గ్రాడ్యుయేట్ కోటా-2) సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. అందులో భాగంగా రెండు బీసీ, రెండు ఓసీ, ఒక ఎస్సీ లేదా ఎస్టీలకు కేటాయించే అవకాశం ఉన్నది. గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ఎంపికలో మాత్రం సామాజిక సమీకరణ కోణంలో చూడకుండా కేవలం గెలిచే అభ్యర్థులను ప్రోత్సహించాలని ఏఐసీసీ నేతలు భావిస్తున్నట్టు తెలిసింది. దీంతో గవర్నర్ కోటాలోని 3 పదవుల్లో రెండు బీసీలకు, ఒకటి ఎస్సీ లేదా ఎస్టీకి ఇచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటాలో నామినేటెడ్ అయిన బస్వరాజు సారయ్య, దాయానంద్ కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. వీరిద్దరూ కూడా తమ పదవులను మరోసారి రెన్యూవల్ చేయాలంటూ సీఎం రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే, కాంగ్రెస్‌లోని కొందరు నేతలు ఇప్పటికే అధిష్టానం పెద్దలను కలిసి తమకు పదవి ఇప్పించాలని లాబీయింగ్ మొదలెట్టినట్టు సమాచారం.

**గెలుపు గుర్రాలకు చాన్స్**

6 ఉమ్మడి జిల్లాలో రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు (వరంగల్- ఖమ్మం--నల్గొండ, మహబూబ్ నగర్-రంగారెడ్డి- హైదరాబాద్) ఎన్నికలు జరుగుతుండటంతో ఆసక్తిగా మారింది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార పార్టీ టార్గెట్ పెట్టుకున్నది. ఎందుకంటే ఈ ఫలితాలు ఆ తర్వాత జరిగే కోర్ ఏరియాలోని మున్సిపల్ ఎన్నికలు, రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, రెండేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి. దీంతో విపక్షాలు సైతం గ్రాడ్యుయేట్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోనున్నాయి. ఈ విషయాన్ని గమనించిన సీఎం రేవంత్ గెలిచే వ్యక్తులకు టికెట్ ఇవ్వాలని భావిస్తున్నారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో సమర్థులైన అభ్యర్థులు ఎవరు? అని చర్చ జరుగుతున్నది. ఈ రెండు నియోజకవర్గాల సీట్లను ఓసీ సామాజిక వర్గానికి ఇచ్చే ఛాన్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇందులో రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తారా? ఒకటి రెడ్డికి ఇచ్చి, మరొకటి ఓసీ వర్గానికి ఇస్తారా? అనే దానిపై ఆసక్తి నెలకొంది.

**అసెంబ్లీ సెషన్స్ ముగిశాక అభ్యర్థుల ఎంపికపై కసరత్తు:** అసెంబ్లీ సెషన్స్ ముగిసిన వెంటనే గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ఎంపికపై సీఎం రేవంత్ ఫోకస్ పెట్టనున్నారు. ముందుగా అభ్యర్థులను ప్రకటిస్తే క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారం సులువు అవుతుందని భావిస్తున్నారు. దీంతో అక్టోబరు చివరి నాటికి అభ్యర్థుల ప్రకటన పూర్తవుతుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గ్రాడ్యుయేట్ కోటాలోని ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో కాంగ్రెస్‌లోని ముఖ్యులు పలు వ్యూహాలు రచిస్తున్నట్టు తెలిసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించే నేతలకు ఇప్పుడు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి భవిష్యత్‌లో పోటి నుంచి తప్పించాలని ప్లాన్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు నేతలు అందుకు కౌంటర్‌గా ప్రతివ్యూహాన్ని రచిస్తున్నట్టు తెలిసింది. టికెట్లు ఆశిస్తున్న లీడర్లు తమకు సన్నిహితంగా ఉండే మంత్రుల ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టారు. తమకు అవకాశం ఇస్తే ఎంత ఖర్చయినా పెట్టుకుంటామంటూ తమ ఆర్థిక పరిస్థితి గురించి వివరిస్తున్నట్టు తెలిసింది. దీంతో డబ్బులున్న వ్యక్తులకు టికెట్ ఇస్తారా? లేక ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు టికెట్ ఇస్తారా? అనేదానిపై ఆసక్తి నెలకొంది.

**ఇద్దరు సలహాదారులు పోటీ**

గవర్నర్ కోటాలోని ఎమ్మెల్సీ పదవుల కోసం ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బ్రహ్మణ సామాజిక వర్గానికి చెందిన హర్కర వేణుగోపాల్,మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన షబ్బీర్ అలీ ఉన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి వేణుగోపాల్ అత్యంత సన్నిహితుడుగా ఉండటంతో పాటు అధిష్టానం పెద్దలతో నేరుగా సంబంధాలు ఉన్నాయి. దీనితో ఆయన పేరును ఆశావాహుల జాబితాలో ప్రధానంగా వినిపిస్తున్నది. అలాగే షబ్బీర్ అలీ సైతం ఎమ్మెల్సీ పదవి కోసం తీవ్రంగా లాబియింగ్ చేస్తున్నారు. కాని ఈ మధ్యనే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చి, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారు. దీనితో అదే గవర్నర్ కోటాలో మరో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇస్తారా?అనే చర్చ జరుగుతున్నది.

**ముగ్గురు జర్నలిస్టులు పోటీ**

ఎమ్మెల్సీ పదవులను దక్కించుకునేందుకు ముగ్గురు జర్నలిస్టులు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురికి ఇప్పటికే సీఎం రేవంత్ పలు పదవులు అప్పగించారు. అయినా, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే తపనతో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అందులో ఇద్దరు ఆర్టీఐ కమిషనర్లు ఉన్నారు. పీవీ శ్రీనివాస్ గ్రాడ్యుయేట్ ఎన్నికల టికెట్ ఆశిస్తుండగా, బోరెడ్డి అయోధ్యరెడ్డి గవర్నర్ కోటా ఎమ్మెల్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే (వరంగల్-ఖమ్మం-నల్గొండ) గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి పీవీ శ్రీనివాస్‌ను పోటీ చేయించేందుకు సీఎం రేవంత్ సానుకూలంగా ఉన్నట్టు ఆ జిల్లాలకు చెందిన పలువురు మంత్రులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. (హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్) గ్రాడ్యుయేట్ టికెట్ కోసం 'టీ-సాట్' సీఈవోగా ఉన్న బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

**ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్..:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కోసం కొండా మురళి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకోసం నేరుగా అధిష్టానంలోని కొందరు పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం సాధ్యం కాదని సంకేతాలు ఇచ్చిన హైకమాండ్ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం ఉంది. ఈ మధ్యనే కేబినెట్ నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేశారు. అందుకు ప్రతిగా మురళికి కార్పొరేషన్ పదవి ఇచ్చే చాన్స్ ఉన్నట్టు తెలిసింది.

**టికెట్ ఆశిస్తున్న కొందరు లీడర్లు:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవుల ఆశిస్తున్న వారిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన బస్వరాజు సారయ్య, మధుయాష్కీ, కొండా మురళి, ఈరవత్రి అనిల్ ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్, దొమ్మాట సాంబయ్య, ప్రీతమ్ ఉండగా.. ఓసి సామాజిక వర్గం నుంచి హర్కర వేణుగోపాల్, దయాసాగర్, రోహిణ్ రెడ్డి ఉన్నారు. మైనార్టీ వర్గం నుంచి షబ్బీర్ అలీ, ఉబెదుల్లా కొత్వాల్ ఉన్నారు. మహిళా కోటా నుంచి సునితా ముదిరాజ్, ఎర్రబెల్లి స్వర్ణ ప్రయత్నిస్తుండగా, ఎస్టీ సామాజిక వర్గం నుంచి బెల్లయ్య నాయక్ ఉన్నారు. 'వరంగల్-ఖమ్మం-నల్గొండ' గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని ఆశిస్తున్న వారిలో పటేల్ రమేశ్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, గుత్తా అమిత్, పొంగులేటి ప్రసాద్ రెడ్డి, పీవీ శ్రీనివాస్, కైలాశ్ నేత, లోకేష్ యాదవ్, మెండెం కిరణ్ (రైట్ ఛాయిస్ విద్యా సంస్థలు) ఉన్నారు. ఇక 'మహబూబ్ నగర్ -హైదరాబాద్-రంగారెడ్డి' ఎమ్మెల్సీని ఆశిస్తున్న వారిలో మన్నే జీవన్ రెడ్డి, శివసేన రెడ్డి, బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, సామా రామ్మోహన్ రెడ్డి, గౌరు సతీశ్ ఉన్నారు.

# తెరాస డిజిటల్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి సందీప్

## డిజిటల్ వేదికలపై పార్టీ ప్రచారం, ప్రజా సమస్యలపై పోరాటానికి దక్కిన గుర్తింపు

ఇది కద నిజం, హైదరాబాద్ :తెలంగాణ రక్షణ సేన పార్టీ సోషల్ మీడియా, డిజిటల్ మీడియా రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బొల్లంపల్లి సందీప్ కుమార్ నియమితులయ్యారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. డిజిటల్ వేదికలపై పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ప్రజా సమస్యలపై నిరంతరం గళం విప్పడంలోనూ ఆయన చూపుతున్న క్రియాశీలక పాత్రను గుర్తించి పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన తెరాస అధినేత్రి కల్వకుంట్ల కవితకు బొల్లంపల్లి సందీప్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధినేత్రి కవిత నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ అప్పగించిన బాధ్యతను అత్యంత నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా మరియు డిజిటల్ మాధ్యమాల ద్వారా పార్టీ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానని వెల్లడించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజా సమస్యల పరిపరిష్కారానికి మరియు కార్యకర్తలకు అండగా డిజిటల్ వేదికలను శక్తివంతంగా వినియోగిస్తానని తెలిపారు. బొల్లంపల్లి సందీప్ కుమార్ నియామకం పట్ల పార్టీ నాయకులు, శ్రేణులు మరియు మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పరిహారం ఇచ్చామంటూ ఎరువులు ఆపేస్తారా?

### - కూటమి ప్రభుత్వ తీరుపై తాండ్ర రాజేష్ ఆగ్రహం

ఇది కద నిజం, కుక్కునూరు: "ముంపు భూములకు పరిహారం ఇచ్చామంటూ నిర్వాసిత రైతులకు ఎరువులు ఆపేస్తారా?" అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తి, మిర్చి సాగు చేస్తున్న నిర్వాసిత రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు అవసరమైన యూరియాను ప్రభుత్వం తక్షణమే అందించాలని ఆయన డిమాండ్



చేశారు. ముంపు భూములకు పరిహారం అందించామన్న కారణంతో రైతులకు యూరియా అందించకపోవడం సరికాదని రాజేష్ అన్నారు. ఎరువులు సకాలంలో అందకపోతే పంటల సాగుపై ప్రభావం పడటంతో పాటు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసిత రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు పేరుతో యూరియా సరఫరాను నిలిపివేస్తే నిర్వాసిత రైతులు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని పత్తి, మిర్చి సాగుకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే రైతుల తరఫున ఆందోళన చేపట్టేందుకు వెనుకాడబోమని తాండ్ర రాజేష్ హెచ్చరించారు.


# డీజే మోతతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

### - కుక్కునూరు ఎస్పై రాజారెడ్డి

ఇది కద నిజం, కుక్కునూరు: పండుగలు, మతపరమైన కార్యక్రమాలు, విగ్రహ నిమజ్జనాల సందర్భంగా డీజే శబ్ద పరికరాలను నిబంధనలకు లోబడి మాత్రమే వినియోగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దం చేస్తే చర్యలు తప్పవని కుక్కునూరు ఎస్పై రాజారెడ్డి సూచించారు. డీజే నిర్వాహకులు, ఆపరేటర్లకు శబ్ద కాలుష్యం, చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కుక్కునూరు పోలీస్ స్టేషన్లో ఆయన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పై రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, ప్రశాంతత, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని డీజే నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనుమతి లేకుండా డీజేలు, లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదని, అనుమతించబడిన శబ్ద పరిమితులకు లోబడి మాత్రమే శబ్ద పరికరాలను నిర్వహించాలని తెలిపారు. సాధారణంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు, శబ్ద వర్ధక పరికరాల వినియోగంపై నిబంధనలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, న్యాయస్థానాలు తదితర నిశ్శబ్ద ప్రాంతాల సమీపంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో డీజే శబ్ద పరికరాల కారణంగా ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. పోలీసులు లేదా సంబంధిత అధికారులు శబ్దాన్ని తగ్గించాలని లేదా నిలిపివేయాలని ఇచ్చే చట్టబద్ధమైన ఆదేశాలను వెంటనే పాటించాలని సూచించారు. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పై రాజారెడ్డి హెచ్చరించారు.



# లండన్‌లో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు



ఇది కద నిజం :యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్ నగరంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అచ్యుత్ రెడ్డి ఢ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక అనివాస భారతీయులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆధ్యాత్మిక చింతన, ఉత్సాహభరిత వాతావరణం నడుమ గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన మహోత్సవాన్ని రఘునాథ్ రెడ్డి, ధనిక్ రాజ్, స్టీఫన్ తదితరులు ముందుండి నడిపించి విజయవంతం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక-భక్తి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తూ ఇలాంటి ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోందని నిర్వాహకులు తెలిపారు. లోకకళ్యాణార్థం, భక్తులందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు వారు పేర్కొన్నారు.

# రక్షిత అటవీ భూములపై రీ సర్వే పనులు పక్కా ప్రణాళికలతో చర్యలు చేపట్టాలి.

### --జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి

అమలాపురం (ఇది కద నిజం)సెప్టెంబర్ 16 : జిల్లాలో రక్షిత అటవీ భూములపై రీ సర్వే పనులు పక్కా ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి తెలిపారు. బుధవారం అమరావతి నుండి చీఫ్ సెక్రటరీ జి సాయి ప్రసాద్ భూ పరిపాలన చీఫ్ కమిషనర్ అధికారిణి జి. జయలక్ష్మితో కలిసి వివిధ జిల్లాలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిషేధిత భూములు 22-ఏ , రీ సర్వే పనులు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, డిజిటలైజేషన్ రెవిన్యూ రికార్డ్స్, రక్షిత అటవీ భూముల పురోగతి, పిజిఆర్ఎస్ వంటి అంశాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ లోని జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్ నందు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమం, 22-ఏ నిషేధిత భూముల జాబితా సవరణ, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, డిజిటలైజేషన్ రెవిన్యూ రికార్డ్స్, రక్షిత అటవీ భూముల పురోగతి, పిజిఆర్ఎస్ ప్రక్రియపై ఆర్డీవోలు తాసిల్దారర్లు అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా రోజువారి సమీక్షలు తప్పనిసరిగా పాటించాలని, రెవిన్యూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గంలో ని ఆర్డీవోలు పర్యవేక్షణ సర్వే పనులపై సమీక్షలు నిరంతరం కొనసాగించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యసాధనలు చేరుకునేలా స్పష్టమైన ప్రణాళికలతో ముందడుగు వేయాలన్నారు. అదేవిధంగా పట్టాదార్ పాసు పుస్తకాల ప్రింటింగ్ విషయంలో సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు లోపాలను సరిచేసి పంపిణీ విషయంలో వేగం పెంచాలన్నారు. జిల్లాలో నిషేధిత భూముల 22-ఏ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, అమలాపురం కాట్రేనికోన రాజోలు పెండింగ్ లో ఉన్న నిషేధిత భూముల కేసులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో డిజిటలైజేషన్ ఆఫ్ రెవిన్యూ రికార్డ్స్ పనులను పూర్తి చేయాలని, డాక్యుమెంట్ ఎక్స్ట్రాక్షన్ స్టేటస్ రిపోర్ట్ ను పూర్తి చేసి తగిన చర్యలు రెవిన్యూ అధికారులను తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో తీర ప్రాంత రక్షిత అటవీ భూములు రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. అల్లవరం మండలంలో బెండమూర్ల లంక, ఐ పోలవరం మండలంలో గుత్తెన దీవి రీ సర్వే పనులు పూర్తి చేశారని మిగతా తీర ప్రాంత రక్షిత అటవీ భూములకు త్వరితిగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల సమస్యలను జవాబుదారీతనంతో పారదర్శకంగా నిర్వహించాలని ఆమె కోరారు. జిల్లా, డివిజన్ మండల స్థాయిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపాలని, పరిష్కారం కానీ అర్జీలను అర్జీదారులకు తెలియజేయాలని ఆమె తెలియజేశారు.



# ప్రతి ఇంటా "ఆశీర్వాద దీపం" వెలిగిద్దాం..!

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీరం సుబ్బారెడ్డి..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 16: "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" లక్ష్యంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవకు కృతజ్ఞతగా, దేశవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీరం సుబ్బారెడ్డి తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే సమిష్టి సంకల్పానికి ప్రతీకగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 న సాయంత్రం 7 గంటలకు ప్రతి ఇంటా ఒక దీపం వెలిగించి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని బీరం పిలుపునిచ్చారు. దేశ సేవకు, ప్రజా సంక్షేమానికి అంకితమై పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని, మోదీ మరింతకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఈ ఆశీర్వాద దీపం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని బీరం సుబ్బారెడ్డి కోరారు.

# ప్రొద్దుటూరులో మంత్రి సత్య కుమార్ బర్త్‌డే వేడుకల సందర్భంగా మెగా రక్తదాన శిబిరం..

### సత్యన్న సేన సంస్థ అధ్యక్షుడు సృజన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి, 1000 యూనిట్ల రక్త సేకరణ..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా ప్రొద్దుటూరులో సత్యన్న సేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి, 1000 యూనిట్ల రక్త సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేశారు. సత్య కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని "సత్యన్న సేన" సంస్థ అధ్యక్షుడు సృజన్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు లోని నామ ఎరుకలయ్య ఆశ్రమంలో మెగా రక్తదాన శిబిరాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు విశేష సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. మొదటగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయుల రాష్ట్ర అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు ముద్దుబిడ్డ, మంత్రి సత్యకుమార్ యాదవ్ సేవా స్ఫూర్తితో సత్తన్న సేనా సంస్కృతి సేవా స్ఫూర్తితో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదురవుతున్న తీవ్రమైన రక్త కొరతను గమనించి, ఆసుపత్రి వర్గాల పిలుపుమేరకు 1000 యూనిట్ల రక్తాన్ని అందిస్తామని ఇచ్చిన మాటను ఈ రోజుతో నిలబెట్టు కున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రొద్దుటూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కు 974 యూనిట్ల రక్తాన్ని అందించగా, నేటి శిబిరం తో 1000 యూనిట్ల లక్ష్యం విజయవంతంగా పూర్తయింది అన్నారు. రక్తదానం చేసి రోగులకు ప్రాణ దాతలుగా నిలిచిన 1,000 మంది దాతలకు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో అత్యవసర సమయంలో రక్తం లేక ఇబ్బంది పడే పేద రోగులకు ఈ రక్త నిల్వలు ఎంతో మేలు చేస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ హరి నారాయణ, సత్యన్న సేన ప్రతినిధులు సృజన్, నరేష్, కిరణ్, హరీష్, లోకేష్ రెడ్డి, ఒంటేరు భాస్కర్ రెడ్డి, గౌరీ శంకర్, చిరు, వంకదార నరేంద్ర, వెంకట్ నాయుడు, స్థానిక బిజెపి నాయకులు, సత్యకుమార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి పాలనలో బ్యాంక్ నగదుకు రక్షణ లేదన్న రాచమల్లు..!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 16: ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకులో ఇన్సూరెన్స్ సొమ్ము దారి మళ్లింపు పై వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిందితులపై జ్యుడీషియల్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రాచమల్లు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరులో ప్రజల డబ్బుకు, ప్రభుత్వ భూములకు, యువత ఉద్యోగాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రమాద వశాత్తు మరణించిన ఎలక్ట్రికల్ ఉద్యోగి సుబ్బరాయుడు ఇన్సూరెన్స్ పరిహారం 11 లక్షలు ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకులో జమయ్యాయి. బ్యాంక్ రికార్డుల ప్రకారం మృతుడి కుమార్తె సుచరిత నామినీగా ఉంది. అయితే ఈ విషయం సుచరిత కు తెలియకుండానే టీడీపీ నేత ఈవి. సుధాకర్ రెడ్డి, సుచరిత స్థానంలో ఉషారాణి అనే మరొక మహిళను తీసుకెళ్లి ఆ డబ్బును విత్ డ్రా చేయించారు. ఈ వివాదంపై స్థానిక ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి అన్నీ తెలిసిన స్పందించకపోవడంలో అంతర్యం ఏమిటో అని రాచమల్లు మీడియా వేదికగా సూటిగా ప్రశ్నించారు. విషయం వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి రంగంలోకి దిగి, సుధాకర్ రెడ్డి తో మాట్లాడి ఆ డబ్బును తిరిగి బ్యాంకులో జమ చేయించారని తెలిపారు. కూటమి నాయకులు యువతకు దక్కాల్సిన డీఎస్సీ ఉద్యోగాలను కూడా అమ్ము కున్నారని ఆరోపించారు. ఈ బ్యాంక్ మోసం, అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రెండు రోజుల క్రితమే నిశ్చితార్థం.. అంతలోనే యువతి ఆత్మహత్య

తాండూరు ,ఇది కద నిజం: రెండు రోజుల క్రితమే వివాహం నిశ్చితార్థమైన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం తాండూరు మండలం జినుగుర్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగలక్ష్మి(21) డిగ్రీ, నర్సు కోర్సు పూర్తి చేసింది. ఏడాది క్రితం తల్లి మృతి చెందడంతో తన తండ్రి అంజిలాప్పకు చేదోడు వాదోడుగా పనులు చేస్తూ ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలోనే నాగలక్ష్మికి వివాహం చేసేందుకు తన తండ్రి.. సిరిగిరిపేటకు చెందిన ఓ యువకుడితో ఆదివారం నిశ్చితార్థం జరిపించారు. మంగళవారం తండ్రీ, కుమార్తెతో కలిసి పట్టణానికి వెళ్లి సామగ్రిని కొనుగోలు చేశారు. తండ్రి నిద్రించాక.. నాగలక్ష్మి ఇంట్లోనే గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన ఆమె తండ్రి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






# స్పై యాక్షన్‌కు డేట్ ఫిక్స్!



టాలెంటెడ్ హీరో అడివి శేష్, దర్శకుడు వినయ్ కుమార్ సిరిగినీడి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'గూఢచారి 2' (జి2). సంచలన విజయం సాధించిన 'గూఢచారి' సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుండటంతో ప్రేక్షకుల్లో మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో టాలెంటెడ్ నటి వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ హీరో ఇమ్రాన్ హష్మీ, మధు శాలిని, సుప్రియ యార్లగడ్డ, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా దాదాపు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే డిసెంబర్, జనవరి నెలల్లో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద పోటీ పడేందుకు పలు క్రేజీ సినిమాలు లైన్‌లో ఉండటంతో, రద్దీని దృష్టిలో ఉంచుకుని సరైన విడుదల తేదీ కోసం చిత్రబృందం మార్చుకుంది. ఈ నేపథ్యంలో అన్ని జోనర్ల ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా, ఈ సినిమాను ఫిబ్రవరి 5న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



# కార్తికేయ కొత్త అవతారం!

టాలీవుడ్ యంగ్ హీరో కార్తికేయ 'ప్రేమతో మీ కార్తీక్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమై, ఆ తర్వాత వచ్చిన సంచలన విజయం 'ఆర్ఎక్స్ 100' తో ఓవర్ నైట్ లోనే స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు. ఆ జోరుతో వరుస సినిమాల్లో హీరోగా నటిస్తూనే, కొన్ని చిత్రాలలో నెగెటివ్ షేడ్స్ ఉన్న విలన్ పాత్రలు చేస్తూ నటుడిగా మంచి గుర్తింపు దక్కించుకున్నారు. ఆ తర్వాత వరుస సినిమాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో బాక్సాఫీసు వద్ద రాణించలేకపోయాయి. కాస్త నిరాశలో పడిన కార్తికేయ రెండేళ్ల పాటు గ్యాప్ తీసుకున్నాడు. ఇక చివరగా 2024లో 'భజే వాయు వేగం' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల అలరించిన కార్తికేయ.. ఒక గట్టి కంబ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేసుకున్నారు.

ఇప్పుడు ఏకంగా మెగాఫోన్ పట్టి దర్శకుడిగా మారబోతున్నట్లు సమాచారం. కేవలం నటించడమే కాకుండా, తనకంటూ ప్రత్యేకంగా ఒక కథను సిద్ధం చేసుకున్న ఆయన.. ఇప్పుడు ఆ కథతోనే డైరెక్టర్‌గా మారి టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా అత్యంత వైభవంగా పూర్తయినట్లు సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు వైరల్ అవుతున్నాయి. కార్తికేయ సొంత నిర్మాణ సంస్థ అయిన 'కార్తికేయ క్రియేటివ్ వర్క్స్' బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం-3గా ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా రాబోతున్నట్లు సమాచారం. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ ఈ సెప్టెంబర్ చివరి వారంలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఓటీటీలోకి 'టాక్సిక్'

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, నేషనల్ అవార్డ్ విన్నర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అత్యంత ప్రతిష్టాత్మక గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్'. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా.. రుక్మిణి వసంత్, స్టార్ హీరోయిన్ నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రల్లో నటించి సినిమాకు మరింత హైలైట్ తీసుకువచ్చారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థతో కలిసి యష్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్‌పై పాన్-ఇండియా రేంజ్‌లో ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించారు. భారీ అంచనాల నడుమ గత ఆగస్టు 26న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయింది. పాజిటివ్ టాక్ కంటే ఎక్కువగా నెగెటివిటీని ఎదుర్కొంది.

ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఈ చిత్రానికి సంబంధించిన ఓటీటీ డిజిటల్ హక్కులను ప్రముఖ ప్రముఖ సంస్థ జీ5 దక్కించుకుంది. తాజా సమాచారం ప్రకారం.. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా సెప్టెంబర్ 25 నుంచి జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు టాక్. అయితే, హిందీ వెర్షన్‌కు సంబంధించి మాత్రం ఈ సినిమా అక్టోబర్ 23 నుంచి స్ట్రీమింగ్‌లోకి అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిన ఈ భారీ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా, ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.







# 'హనుమాన్ అన్ష్'కు బిగ్ బ్రేక్!

గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 300 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను చేరుకుని సంచలనం సృష్టిస్తున్న 'హనుమాన్ అన్ష్' చిత్రానికి తెలుగు నాట ఊహించని బ్రేకులు పడ్డాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే సెప్టెంబర్ 18న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. కానీ, రిలీజ్‌కు సరిగ్గా కొద్ది రోజుల ముందు చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలు ఈ డబ్బింగ్ సినిమా భవితవ్యాన్ని ప్రశ్నార్థకంలో పడేశాయి. ఫార్ట్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో ప్రెజెంట్ చేసేందుకు ముందుకొచ్చారు. ఆయన బ్రాండ్ నేమ్ వల్ల తెలుగు మార్కెట్‌లో ఈ సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయింది. కానీ, అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ నుంచి త్రివిక్రమ్ తప్పుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. లాస్ట్ మినిట్ లో డీల్ క్యాన్సిల్ అవ్వడం వల్లే సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో జరగాల్సిన భారీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను రాత్రికి రాత్రే రద్దు చేశారు. ఆయన ఎగ్జిట్‌పై చిత్రబృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఒకవేళ రాత్రికి రాత్రే కొత్త డిస్ట్రిబ్యూటర్ దొరికినా సినిమా రిలీజ్ అవ్వడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత సులువు కాదు. 'హనుమాన్ అన్ష్' తెలుగు వెర్షన్‌కు సెన్సార్ బోర్డు నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదని, క్లియరెన్స్ కోసం పెండింగ్‌లో ఉందని లేటెస్ట్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. సెన్సార్ సర్టిఫికేట్ రాకపోవడం, ప్రెస్ మీట్స్ జరగకపోవడం, ఇప్పటివరకు కనీసం తెలుగు ట్రైలర్ కూడా రిలీజ్ చేయకపోవడంతో ఈ ప్రాజెక్ట్ చుట్టూ అనిశ్చితి నెలకొంది. కొత్త ప్రెజెంటర్ దొరికి, సెన్సార్ పనులు పూర్తయితే కానీ సినిమా థియేటర్లలోకి రాలేదు.

# అడవిలో దాగిన మిస్టరీ




దివంగత 'రియల్ స్టార్' శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ చిత్రం 'ఆస్మాన్' అఫీషియల్ టీజర్ గ్రాండ్‌గా విడుదలైంది. రాక్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి హైదరాబాద్‌లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 'ఆస్మాన్' టీజర్‌ను ఆఫీషియల్ గా లాంచ్ చేశారు. ఈ మిస్టిక్ హారర్ థ్రిల్లర్ చిత్రాన్ని కాంబోడియాలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా అడవి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించారు. టీజర్‌లో చూపించిన విజువల్స్, యాక్షన్ సీక్వెన్సులు, హారర్ ట్విస్టులు సినిమాపై బజ్ పెంచుతుండగా, మేఘాంశ్ తన తండ్రిని గుర్తుకు తెచ్చేలా పవర్‌ఫుల్ మాస్ లుక్‌లో కనిపించి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ అందుకుంటున్నారు.

'ఆస్మాన్' టీజర్‌లో ఒక కుటుంబాన్ని ప్రధానంగా పరిచయం చేశారు. ఆ కుటుంబం కొన్ని మూఢనమ్మకాలను గట్టిగా నమ్ముతూ, దుష్ట శక్తులతో సంబంధం ఉన్నట్లు అనిపించే కొన్ని కలవరపరిచే పనులు చేస్తుంటుంది. పరిస్థితులు క్రమంగా ప్రమాదకరంగా మారుతున్న సమయంలో మేఘంశ్ పాత్ర రంగంలోకి దిగినట్లు టీజర్ చూపిస్తోంది. అసలు ఆ కుటుంబానికి ఎదురైన సమస్య ఏమిటి? మేఘంశ్ దానిని పరిష్కరించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారనే విషయాలను మాత్రం టీజర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. టీజర్‌ను ఆసక్తికరమైన విజువల్స్, సస్పెన్స్‌తో కట్ చేశారు. కథను బయటపెట్టకుండా కేవలం కొన్ని సన్నివేశాలతోనే క్యూరియాసిటీ పెంచే ప్రయత్నం చేశారు. టీజర్ చూస్తుంటే కంటెట్ గట్టిగానే ఉన్నట్లు అనిపిస్తోంది.

మేఘంశ్ శ్రీహరి ఇప్పటికే 'రాజ్ దూత్', 'కోతి కొమ్మచ్చి' సినిమాల్లో నటించినప్పటికీ సరైన బ్రేక్ మాత్రం రాలేదు. అయితే ఇప్పుడు 'ఆస్మాన్'తో మరోసారి తనను తాను కొత్తగా చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సినిమా కేవలం తెలుగు ప్రేక్షకులకే పరిమితం కాకుండా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంతేకాదు అరబిక్ భాషలో కూడా సినిమాను రిలీజ్ చేయనున్నారు. రామ్ నందన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మేఘాంశ్ సరసన రాయంచ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవివర్మ, కమల్ కామరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్‌పై వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ప్రశాంత్ ఆర్. విహారి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం టీజర్ ద్వారా క్యూరియాసిటీ పెంచిన మేకర్స్ త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఇక 'ఆస్మాన్'లో దాగి ఉన్న అసలు మిస్టరీ ఏంటో తెలియాలంటే అప్పటివరకు వేచి చూడాల్సిందే.

# అంత వైలెన్సా?




న్యాచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-వరల్డ్ మూవీ 'ది ప్యారడైజ్'. నాని అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' ఈనెల 24న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించి సెన్సార్ కార్యక్రమాలు ఫినిష్ చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'ఏ' (అడల్ట్) సర్టిఫికేట్‌ను జారీ చేసింది. అయితే ప్రస్తుతం లభించిన ఈ సర్టిఫికేషన్ కేవలం సినిమా రఫ్ కట్ కి మాత్రమేనని తెలుస్తోంది.

సినిమాకు సంబంధించిన ఫైనల్ కట్ ఇంకా పూర్తికావాల్సి ఉంది. చిత్రీకరణ ఇటీవల ఫినిష్ చేసుకున్న ఈ సినిమా నేపథ్యసంగీతానికి సంబంధించి అనిరుధ్ ఇంకా వర్క్ చేస్తూనే ఉన్నాడు. ఇప్పటి వరకు ఫస్టాఫ్ మాత్రమే RR ఫినిష్ చేసాడు. రిలీజ్ కు దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మరియు ఇతర పనులను వేగవంతం చేయడానికి చిత్రబృందం ముందుగా రఫ్ కట్‌ను సెన్సార్ పరిశీలనకు పంపినట్లు సమాచారం.

ఫైనల్ కట్ లాక్ అయిన తర్వాత సినిమా నిడివి మరియు కొన్ని రంగాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలలో డబుల్ మీనింగ్ మాటలు, యాక్షన్ ఘట్టాలలో వైలెన్స్ ఎక్కువగా ఉండడం రక్తపాతం మోతాదుకు మించి ఉండడం మరియు కథా నేపథ్యం వల్లే ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఫైనల్ కట్ లాక్ అయిన తర్వాత అధికారికంగా మరోసారి ప్రకటన వచ్చే అవకాశం ఉంది.